నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



రసూల్‌పురా: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఆదర్శనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదర్శనగర్, వైష్ణవీ మాత టెంపుల్, ఈస్ట్ వెంకటపురం, ఎంఈఎస్ కాలనీ, నారాయణ పురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ మురళీకృష్ణ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు



నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్..

సనత్‌నగర్: ఆర్థిక సమస్యలు చదువుకు అడ్డంకి కాకూడదని బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన రఘుకుమార్ కుమార్తె గీతా మాధురి, కుమారుడు మోక్షిత్‌ముదిరాజ్ చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో స్పందించిన ఆయన బుధవారం గీతా మాధురికి రూ.22,000, మోక్షిత్‌ముదిరాజ్‌కు రూ.8,000 ఆర్థిక సహాయం అందించారు. తమ చదువులకు ఆర్థిక చేయూతను అందించిన వెల్లాల రామ్మోహన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకోవడంతోనే తమకు తాము ఉన్నతంగా జీవించడంతో పాటు మరికొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగలుగుతారన్నారు. విద్యతోనే సమాజ వికాసం జరుగుతుందన్నారు. బవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలను సాధించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి

ఉస్మానియా యూనివర్సిటీ: అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీజేఎస్ ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌కు పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం బుధవారం వినతి పత్రం అందజేసింది. యూనివర్సిటీ సమస్యలపై ప్రత్యేకంగా మాట్లాడాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాల భర్తీ, విద్యాశాఖ మంత్రి నియామకం, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు, పెండింగ్ ఫీజు రీయింబర్స్ నిధుల విడుదల తదిర అంశాలపై చర్చించాలని విజ్ఞప్తి చేసినట్లు పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు.

పద్మశాలీల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

బొద్దనగర్: పద్మశాలీల ఆధ్వర్యంలో ఈ నెల 9న జరుగనున్న మహాసభను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం వారాసిగూడ చౌరస్తాలో సభ సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యతను చాటుకునేందుకు నిర్వహించే ఈ సభలో ప్రతి పద్మశాలి కుటుంబీకులు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కొఠారి కమిషన్ సిఫార్సు మేరకు విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్రం 10 శాతం, దేశ డీజీపీలో 6 శాతం నిధులను కేటాయించాలని ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే.వేణు గోపాల్ అన్నారు. బుధవారం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాలులో యూజీసి నూతన నింబంధనలను వ్యతిరేకంగా సదస్సు జరిగింది. కార్యక్రమానికి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీ శ్రీకాంత్ అధ్యక్షత వహించగా వేణు గోపాల్, ఓయూ అధ్యాపకులు కొండనాగేశ్వర్, మహేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. యూజీసీ నూతన నిబంధనలు వర్సిటీ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉన్నాయని కొండ నాగేశ్వర్ అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, మంద నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు..



నోటీసు బోర్డులో చెక్ చేసుకుంటున్న విద్యార్థులు..



పరీక్షకు వెళ్లే ముందు మరోసారి రివైజ్ చేసుకుంటూ..

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం..

నిమిషం నిబంధన సడలింపు

- ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి
- ఒకే పేరుతో పలు సెంటర్లు
- విద్యార్థుల అవస్థలు



ఎస్‌ఆర్‌నగర్‌లోని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం..

సనత్‌నగర్: ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని ఎస్‌ఆర్‌నగర్, బేగంపేట, అమీర్‌పేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట తదితర ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి వెంట వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సందడి నెలకొంది. ఇంటర్మీడియేట్ బోర్డు గతంలో విధించిన ఒక్క నిమిషం ఆలస్యం నిబంధనను సడలించారు. ఉదయం 9 గంటలకు పరీక్షా ప్రారంభం కాగా 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్షా హాల్‌లోకి కేంద్రాల్లోకి అనుమతించారు. అయితే ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడం కనిపించింది. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే విద్యార్థులకు తమ కుటుంబసభ్యులు ఆల్ ది బెస్ట్ చెప్పి పరీక్ష అయ్యేవరకు అక్కడే వేచి ఉండడం గమనార్హం. మరోవైపు మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీరు, ఫ్యాన్లు తదితర వసతులు కల్పించారు. ఎస్సార్‌నగర్, బేగంపేట, రాంగోపాల్‌పేట, మోండా పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 26 పరీక్షా కేంద్రాల్లో 14,320 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఒకే పేరుతో రెండు మూడు క్యాంపస్‌లు..

కార్పొరేట్ కళాశాలలకు చెందిన భవనాలు ఒకే ప్రాంతంలో రెండు మూడు ఉండడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రం ఏదో తెలియక ఆందోళనకు గురయ్యారు. కోడ్ ఆధారంగా పరీక్షా కేంద్రాలను గుర్తించాల్సి ఉండగా విద్యార్థులు మరోచోట అదే పేరున ఉన్న సెంటర్‌కు వెళ్లి తీరా అక్కడ తమ నంబర్ లేకపోవడంతో అసలు కేంద్రానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఎక్కడ సమయం అయిపోతుందేమోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు.

సహకరించిన ట్రాఫిక్ పోలీసులు

అడ్రస్ తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసులు దిక్సూచిగా మారి పరీక్షా కేంద్రాల వద్దకు చేర్చడంలో తమదైన పాత్ర పోషించారు. పరీక్ష రాసేందుకు వచ్చేవారు ఎవరు అడిగినా ఓపిగ్గా సమాధానాలు చెబుతూ నిర్ణీత సమయంలో పరీక్ష కేంద్రానికి చేర్చడంలో ట్రాఫిక్ పోలీసులు శభాష్ అనిపించుకున్నారు.



ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 21, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 45, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 23, చామగడ్డ 53, మొరంగడ్డ 35, కందగడ్డ 75, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

జనతా పార్టీ బలోపేతానికి కృషి

రాంగోపాల్‌పేట్: అన్ని రాజకీయ పార్టీలకు మాతృ సంస్థ అయిన జనతా పార్టీని బలోపేతం చేస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు నవ్‌నీత్ చతుర్వేది అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని గ్రాండ్ మినర్వా హోటల్‌లో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ తర్వాత జయప్రకాష్ నారాయణ నేతృత్వంలోని జనతా పార్టీ అధికారం చేపట్టిందని, ప్రస్తుతం ఉన్న బీజేపీతో పాటు జేడీయూ, జేడీఎస్, సమాజ్‌వాదీ పార్టీ, బీజూ జనతాదళ్ తదితర అనేక పార్టీలకు తమ పార్టీ మాతృ సంస్థ అన్నారు. సుబ్రమణ్యస్వామి పార్టీని వీడిన తర్వాత పార్టీ కొంత బలహీనపడిందని తాను అధ్యక్ష పదవి చేపట్టినప్పటి నుంచి వివిధ రాష్ట్రాల్లో పార్టీని పునర్నిర్మించే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బీహార్‌లో బూత్, బ్లాక్ స్థాయి నుంచి మళ్లీ నిర్మించి కొత్త జవసత్వాలు తీసుకుని వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో వివిధ పార్టీల్లో అసంతృప్త నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు బీహార్, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో బలమైన అభ్యర్థులతో బరిలో దిగి తమ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ యువత విభాగం నాయకులు చంద్రప్రకాశ్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముషీరాబాద్ మండల పరిధిలోని బన్సీలాల్‌పేట డివిజన్‌కు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లి ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్నదన్నారు. వారికి చేయూతను అందించేందుకు గత ప్రభుత్వం రూ.1,00116ల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, ముషీరాబాద్ మండల ఆర్ఐలు సత్యప్రసాద్‌రావు, ప్రణీత్‌రావు, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, ఆకుల హరికృష్ణ, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, మహేష్‌కుమార్‌యాదవ్, గజ్జెల శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

కంటోన్మెంట్: వెట్టి చాకిరీ, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బుధవారం దివ్య దిశ సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డ్ కార్యాలయంలో మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంటోన్మెంట్ సీఈఓ మధుకనాయక్‌తో పాటు ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, గౌరవంగా బతికేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందని అన్నారు. వెట్టి చాకిరీ, మానవ అక్రమ రవాణా చట్ట రీత్యానేరమని ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించాలన్నారు. అవగాహన కార్యక్రమాల్లో పోలీస్, కార్మిక శాఖ అధికారులను కూడా భాగస్వాములను చేస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

నవజాత శిశువుల సంరక్షణలో మిడ్‌వైఫ్‌ల పాత్ర కీలకం




వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వైద్య నిపుణులు

గాంధీఆస్పత్రి: నవజాత శిశువుల సంరక్షణలో మిడ్‌వైఫ్‌ల పాత్ర కీలకమని పలువురు వైద్య నిపుణులు అన్నారు. బుధవారం గాంధీఆస్పత్రి మాతాశిశు సంరక్షణ విభాగంలో సొసైటీ ఆఫ్ మిడ్‌వైఫ్ ఇండియా (సోమి), హిమాలయా బేబీకేర్ సెంటర్, గాంధీఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఎసెన్సియల్ న్యూబోర్న్ కేర్ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక వైద్య విధానాలు, పద్ధతులు, నెలలు నిండకుండా పుట్టిన శిశువుల సంరక్షణ, ఇంపార్టెన్స్ ఆఫ్ ఎసెన్సియల్ న్యూబోర్న్ కేర్, రోల్ ఆఫ్ మిడ్‌వైఫ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముర్రుపాలు, పుట్టిన వెంటనే శిశువు ఆరోగ్యం, సంరక్షణ తదితర విషయాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించి వారి సందేహాలను నివృత్తి చేసి, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఆఫ్ మిడ్‌వైఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ శాంతి విక్టోరియారాణి, కోఆర్డినేటర్ సంధ్యారాణి, గాంధీ గైనకాలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ రాధ, సీఎంఓ బ్రహ్మేశ్వర్, ఆర్ఎంఓ సుథార్‌సింగ్, గాంధీ నర్సింగ్ సూపరింటెండెంట్ దయానిధి, వైద్యులు శోభలతోపాటు లేబర్‌వార్డు, పీడియాట్రిక్, గైనకాలజీ తదితర విభాగాలకు చెందిన సుమారు వందమంది స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

8న ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలు

లాలాపేట: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ప్రసన్న బోల్లు, ప్రధాన కార్యదర్శి అనంతోజు రక్షిత అన్నారు. ఈ మేరకు బుధవారం తార్నాకలోని ఐనోస్ చర్చి హాల్ నేషనల్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 8న మల్కాజిగిరి జ్యోతినగర్ కమ్యునిటీ హాల్‌లో నిర్వహించనున్న మహిళా దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు హాజరై మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. క్రిస్టియానిటీలో మహిళకు సముచితమైన గౌరవం ప్రాధాన్యం ఇస్తున్నామని,. ఇందులో భాగంగానే ఎన్‌సీసీలో మహిళలకు 33 శాతం ప్రాతినిథ్యం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన మహిళలను అవార్డులతో సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ రీజినల్ కోఆర్డీనేటర్ టి. ప్రియా తిమోతి, బి, కుమారి, మంజులత, రిబ్కా శ్యామ్ నథాని, ఎస్తేర్ రాణి, ఎలిజబెత్ దార్ల, జె ఫ్లోరెన్స్, మిరియమ్, లావణ్య, రోజమ్మ, మేరీ గ్రేస్, పద్మా పల్లవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్న

ఉత్తమ రైతు, మహిళా రైతు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

లాలాపేట: ఉత్తమ రైతు, మహిళా రైతులకు అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రిటైర్డు అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ కృపాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమీకృత, సేంద్రీయ వ్యవసాయం, ఉద్యాన తదితర పంటల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న రైతులు, మహిళా రైతులను ప్రోత్సహించేందుకు పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. ఆసక్తి గల రైతులు ఫోన్ 8886861186, 9010498345 లలో సంప్రదించాలన్నారు. ఈ నెల 12 లోగా దరఖాస్తు ఫారాలను హైదరాబాద్ అశోక్ నగర్‌లోని వ్యవసాయ అధికారుల సంఘం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు ఇంజిన్ కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సఫిల్‌గూడ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి వేగంగా వస్తున్న రైలు ఇంజిన్‌కు ఎదురుగా వచ్చిన మహిళ ఇంజిన్ కింద పడటంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి ఒంటిపై నీలిరంగు కుర్తా, తెల్లని రంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

చెరువులో మట్టి డంపింగ్ చేస్తున్న లారీలు సీజ్..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని తాజ్‌బంజారా చెరువులో అక్రమంగా మట్టి డంప్ చేస్తున్న రెండు లారీలను బంజారాహిల్స్ పోలీసులు సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..తాజ్ బంజారా చెరువులోకి వెళ్లేందుకు బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1 వైపు నుంచి యూబీడీ విభాగం నిర్వహణలో గేటు ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం ఉదయం నుంచి ఈ గేటు నుంచి వెళ్తున్న లారీలు చెరువులో మట్టి డంపింగ్ చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. మంగళవారం రాత్రి పోలీసులు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రెండు లారీలను సీజ్ చేశారు. మట్టి డంపింగ్ చేసినందుకు ఒక్కో ట్రిప్పుకు రూ.1600 వసూలు చేస్తున్నట్లుగా తేలింది. అయితే ఈ డబ్బులు ఎవరు వసూలు చేస్తున్నారనే విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు. సుమారుగా ఈ రెండు లారీల ద్వారా 32 ట్రిప్పుల మట్టిని చెరువులో డంప్ చేసినట్లుగా నిర్ధారణ అయ్యింది. రెండు లారీలను సీజ్ చేసిన పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు. మట్టిని డంపింగ్ చేయించుకుంటున్న గంధం ప్రవీణ్‌కుమార్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొంతకాలంగా కొందరు జీహెచ్ఎంసీ సిబ్బంది లారీల యజమానులతో కుమ్మక్కై చెరువులో మట్టిని డంపింగ్ చేయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పార్కు గేటు నుంచి చెరువులోకి వెళ్లి ప్రైవేటు వ్యక్తులు ఎలా డంపింగ్ చేస్తున్నారని, వారికి ఎవరు సహకారం అందిస్తున్నారన్న దానిపై విచారణ చేపట్టాలని జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని మేయర్ ఆదేశించారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించండి



సీఈఓతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేశ్

సీఈఓకు ఎమ్మెల్యే వినతి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి నేతాజీ నగర్‌లో నిరుపయోగంగా ఉన్న పాఠశాల స్థలాన్ని కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి సీఈఓతో పలు అంశాలనూ చర్చించారు. నేతాజీ నగర్‌లో గతంలో స్కూలు కోసం కేటాయించిన స్థలం ప్రస్తుతం నిరుపయోగంగా ఉందన్నారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను తొలగించి, కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పికెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని ఖాళీ స్థలంలో షెడ్ నిర్మించి మహిళల ట్రైనింగ్ సెంటర్ కోసం కేటాయించాలన్నారు. తద్వారా స్థానిక మహిళలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బొల్లారంలోని జనప్రియ అపార్ట్ మెంట్ లో సీవరేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థి దశలోనే సేవా భావం అలవర్చుకోవాలి

రాంగోపాల్‌పేట్: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలర్చుకుని దేశానికి, అవసరంలో ఉన్న వారికి సేవలు అందించాలని సెయింట్ మేరీస్ ఎంబీఏ కాలేజ్ డైరెక్టర్ పాదర్ ఆంటోని వినయ్ అన్నారు. బుధవారం కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు ఇంటర్ మీడియేట్ పరీక్షలు రాసి వెళ్తున్న విద్యార్థులకు సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజ్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న సమయంలో విద్యార్థులకు ఎండదెబ్బ తగులకుండా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సామాజిక సేవలో భాగంగా మనం చేసే చిన్న సహాయం కొన్ని సందర్భాల్లో కొంత మంది జీవితాల్లో మార్పును తెస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న పాదర్ ఆంటోనీ వినయ్

సాయన్న సేవలు ఎనలేనివి




విద్యార్థినికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి తలసాని

రసూల్‌పురా: చరిత్ర ఉన్నంతకాలం కంటోన్మెంట్ నియోజకవర్గం దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలను ప్రజలు గుర్తుంచుకుంటారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రసూల్‌పురా సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద బుధవారం బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాయన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తలసాని సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా కొనసాగిన సాయన్న పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇచ్చారని, మంచినీటి సమస్యతో పాటు, అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు కార్యక్రమంలో రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జేల నాగేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు నరసింహ ముదిరాజ్, నాయకులు దేవులపల్లి శ్రీనివాస్, కుమార్ ముదిరాజ్, తేజ్‌పాల్, ధన్‌రాజ్. చంద్రకాంత్, సదానంద్ యాదవ్, మాధురి, రాణి తదితరులు పాల్గొన్నారు.

సాయన్న ఆశయసాధనకు కృషి

రసూల్‌పురా: తన తండ్రి, కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానని బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న అన్నారు. బుధవారం సాయన్న జయంతి సందర్భంగా బాలంరాయిలో దివ్యాంగ వృద్ధురాలికి వీల్ చైర్ అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే 30 ఏళ్లుగా కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. పేదలకు సొంతగూడు ఉండాలనే లక్ష్యంతో నియోజకవర్గంలోని 1200 డబుల్‌బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నమ్రత, శ్లోక, గజ్జెల గోపాల్ పాల్గొన్నారు.



వృద్ధురాలికి వీల్ చైర్ అందజేస్తున్న నివేదిత సాయన్న